క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ మింది ఫీడర్, 11 కేవీ గాజువాక ఫీడర్‌లోని 11/33 కేవీ బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ నుంచి కొనసాగుతున్న లైన్‌కు అంతరాయంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపు, నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు జోన్ -2 ఈఈ బీకే నాయుడు గురువారం తెలిపారు. మింది ఏరియా, రాంనగర్ ఏరియా, గిరిప్రసాద్ కాలనీ, రాజీవ్‌నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

రోగులతో దురుసుగా ప్రవర్తించొద్దు

అగనంపూడి: రోగులు, వారి బంధువులపట్ల ల్యాబ్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ భారతి హెచ్చరించారు. ల్యాబ్ సిబ్బందిపై డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్ కమిషనర్ అట్టాడ సిరికి ఫిర్యాదులు అందడంతో తక్షణం విచారణ జరపాలని సూపరింటిండెంట్‌ను ఆదేశించారు. దీంతో సూపరింటిండెంట్ గురువారం ల్యాబ్ సిబ్బందితో సమావేశమయ్యారు. రోగులు, వారి బంధువులతో మర్యాదగా ప్రవర్తించాలని, మరోసారి ఇటువంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్యం కోసం ఆటలాడాలి



విజ్ఞాన్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: ఆరోగ్యం, ఆనందం, మానసిక ఉల్లాసం, పరిపక్వత కోసం ఆటలాడాలని విజ్ఞాన్ ఇంజినీరింగ్‌కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ బి.సతీష్, ఫిజికల్ డైరెక్టర్లు సీహెచ్.రాంబాబు, రమణ, ప్రశాంత్, ఏ.భారతి తదితరులు పాల్గొన్నారు. లంకెలపాలెం హైస్కూల్‌లో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు , రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు జగదీష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన ఇంజినీరింగ్ షాప్స్ ఫైవ్ ఎస్ వారోత్సవాలు



అవార్డులు అందజేస్తున్న జీఎంలు మధుసూధనరావు, పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజనీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో ఫైవ్ ఎస్ (పని ప్రదేశ నిర్వహణ) వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం విభాగం కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ వెల్ఫేర్ విభాగం జీఎం ఎం. మధుసూధనరావు ముఖ్య అతిథిగా హాజరై బెస్ట్ ఫైవ్ ఎస్ జోన్, బెస్ట్ కైజన్, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైవ్ ఎస్ అమలు చేయడం వల్ల పని ప్రదేశం సురక్షితంగా ఉండటంతో ఉత్పత్తి పెంపుదలకు దోహదపడుతుందన్నారు. విభాగాధిపతి, జీఎం ఎస్.కె. పాండే మాట్లాడుతూ వారోత్సవాల్లో చేసిన కార్యక్రమాలను వివరించారు. మెకానికల్ ఇన్‌చార్జ్ ఎన్. వీరేశం ఉత్సవ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఫైవ్ ఎస్ కో-ఆర్డినేటర్ పి. విద్యాసాగర్, అధికారులు బి.ఆర్. జెనా, కృష్ణప్రసాద్, కె. శ్రీనివాసరావు, నాయక్, ఎం. రాజశేఖర్, సిహెచ్. శ్రీనివాస శాస్త్రి, సిహెచ్. అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు ప్లానింగ్ సపోర్ట్



ముసుగేసి ప్లాన్ విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

- ప్లాన్ ఒకటి.. నిర్మాణాలు రెండు..
- టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై అనుమానాలు

పెదగంట్యాడ: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ జోన్-6 పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. భవన నిర్మాణాల ప్లాన్ల విషయంలో కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసులిస్తే చాలు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. అనుమతుల విషయంలో దోపిడీయే లక్ష్యంగా పని చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే వారి పంట పండినట్టే.. ఫిర్యాదుల బూచి చూపించి అక్రమ నిర్మాణదారుల నుంచి ఎక్కువ డబ్బులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అవినీతికి అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యాడంటూ ఏకరువు పెడుతున్నారు.



ఒకే ప్లాన్‌పై రెండు నిర్మాణాలు



అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

మండలంలోని పలు వార్డుల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్లాన్ ఒకటి తీసుకుని మరోలా భవనాలను నిర్మిస్తున్నారు. కొన్ని వార్డుల్లో అసలు ప్లాన్‌లే లేకుండా నిర్మిస్తున్నారు. దీనికి జీవీఎంసీ జోన్-6 టౌన్ ప్లానింగ్ అధికారులు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సిద్ధేశ్వరం ప్రధాన రహదారిని ఇటీవల డబుల్‌రోడ్డుగా విస్తరించారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. దీంతో ఈ రహదారి విశాలంగా మారింది. అంతేకాకుండా ఈ రోడ్డుకు ఇరువైపులా కమర్షియల్ హోదా లభించింది. దీని కారణంగా అక్కడ కొత్తగా ఇరువైపులా నిర్మాణాలు జోరందుకున్నాయి. అయితే ఈ ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు కేటాయించిన 107 చదరపు గజాల స్థలాలే ఉన్నాయి. ఈ స్థలాలకు సంబంధించి జీవీఎంసీ నుంచి కేవలం జి+2 వరకూ టౌన్‌ప్లానింగ్ నుంచి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అందులో సగం 53.5 చదరపు గజాల స్థలం ఉంటే అక్కడ కేవలం జీ +1 వరకు మాత్రమే అనుమతులు ఇవ్వాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా ఇక్కడ నిర్మాణాలు ఊపందుకున్నాయి. 107 చదరపు గజాల స్థలాల్లో జి+3 నుంచి 4 వరకూ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను మేనేజ్ చేసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. అలాగే 53.5 చదరపు గజాల స్థలాల్లో కూడా జి+3 వరకూ నిర్మాణాలను అడ్డగోలుగా చేపడుతున్నారు. అంతేకాకుండా అనుమతులేమో రెసిడెన్షియల్‌కు తీసుకుంటున్నారు. ఆ ప్లాన్‌తో కమర్షియల్ (దుకాణాలు) చేపడుతున్నారు. ఈ తతంగమంతా అధికారులకు తెలిసే జరుగుతోందని, దీని వెనుక పెద్ద ఎత్తున సొమ్ములు చేతులు మారుతున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సిద్ధేశ్వరం రోడ్డులోనే ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు సాగుతుండడంతో పెద్ద ఎత్తున జీవీఎంసీ ఆదాయానికి గండి పడుతోంది. ఈ ఒక్క ప్రాంతంలోనే ఇన్ని నిర్మాణాలు జరుగుతుంటే మిగిలిన వార్డుల్లో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక్కడ అక్కడా అని కాదు అన్ని ప్రాంతాల్లో ఇదే తంతు నెలకొని ఉంది. కూటమి ప్రభుత్వంలోని నేతలు అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారని స్థానికులు బహిరంగగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



53.5 చదరపు గజాల్లో జి+2 కమర్షియల్ భవన నిర్మాణం

ఒక్కటైన అక్రమ నిర్మాణదారులు

సిద్ధేశ్వరం ప్రధాన రహదారిలో ఇద్దరు అక్రమ నిర్మాణదారులు ఒక్కటయ్యారు.. వీరిద్దరికీ చెరో 53.5 చదరపు గజాల స్థలం ఉండగా..వాటిని రెండుగా కలిపి 107 చదరపు గజాలకు జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకున్నారు. అది కూడా రెసిడెన్షియల్ ప్లాన్ మాత్రమే. ఆ ప్లాన్‌కు విరుద్ధంగా ఇక్కడ నిర్మాణం సాగిస్తున్నారు. 107 చదరపు గజాలకు ప్లాన్ తీసుకుని 53.5 చదరపు గజాల వంతున నిర్మాణం చేపట్టారు. దీనికి సంబంధించి విడివిడిగా మెట్లు కట్టారు. శ్లాబ్‌లు కూడా విడిగా వేశారు. బయటకు మాత్రం ఒకే భవనం కనిపించేలా ఎలివేషన్ నిర్మిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఆ నిర్మాణాన్ని పరిశీలించి.. అక్రమ నిర్మాణదారునితో కుమ్మక్కై పెద్ద ఎత్తున ముడుపులు అందుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.. కంచె చేను మేసిన చందంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి భవిష్యత్తులో మరింతమంది ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే అవకాశం ఉందని అంటున్నారు.

పరిశీలిస్తాం

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. అలాగే ప్లానింగ్‌కు విరుద్ధంగా ఎవరైనా భవనాలు నిర్మిస్తే వాటిని తొలగిస్తాం. ఈ విషయంలో ఎవరి సిఫార్సులకు, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటాం.

–శ్రీలక్ష్మి, ఏసీపీ– జోన్-6 టౌన్‌ప్లానింగ్

తెలుగు భాష..మనందరి శ్వాస



భువన విజయం నాటికను ప్రదర్శిస్తున్న చలపతి స్కూల్ విద్యార్థులు



తెలుగు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు

పెదగంట్యాడ:అమృతం లాంటి తెలుగు భాష మరువొద్దని తెలుగు భాషపై విద్యార్థులు మరింత పట్టు సాధించాలని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు వెంకట రామూర్తి, జాతీయ హాకీ క్రీడా పితామహుడు మేజర్ ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి, గిడుగు రామూర్తి వేషాధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ, ధనలక్ష్మి, బాబ్జీ, చంద్రకళ, మోహనలక్ష్మీ, కుమారి, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో..

తెలుగు బాషా పితామహుడు గిడుగు వెంకట రామూర్తి జయంతిని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు చిత్ర పటానికి గ్రంథాలయాధికారి పీవీ రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, పురుషోత్తం, హరి, నవ్య, వెంకట్ పాల్గొన్నారు.

తెలుగు భాష తీయనిది

గాజువాక: గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గాజువాకలోని వివిధ విద్యా సంస్థల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుభాష గొప్పదనాన్ని, ఔన్నత్యాన్ని వివరిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.



తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థిని

- స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ భారతదేశంలో హిందీ తరువాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు అని పేర్కొన్నారు.
- స్థానిక చలపతి స్కూల్‌లో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భువన విజయం నాటికను ప్రదర్శించడంద్వారా తెలుగుభాష ఔన్నత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎ.బాలరెడ్డి, ప్రిన్సిపాల్ గణేశ్వరరావు, ఏవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్ కుమార్ తదితరులు గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు నర్సింహం, వినోద్ బాలు, కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ఎన్.శ్రీను, ఆర్‌వీఆర్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-11 శ్రిష్టి వరల్డ్ స్కూల్‌లో గురువారం తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా జరిగాయి. తెలుగు భాషాదినోత్సవంలో భాగంగా గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల ఉపన్యాసాలు, పద్యాలు, గేయాలు, నృత్య రూకాలు, పేరడి పాటలు, కవితల ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్ దేవగిరి, పీఈటీలు తిరుపతిరావు, రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయులకు సత్కారం

అగనంపూడి: గిడుగు రామూర్తి పంతులు తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని రాంకీ ఫౌండేషన్ ఏఈ జగదీష్, లంకెలపాలెం హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో పాఠశాల విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అలాగే తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుల్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి, ఉపాధ్యాయులు రమణ, లక్ష్మీరాణి, తదితరులు పాల్గొన్నారు. 85వ వార్డు అగనంపూడి చట్టివానిపాలెం శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం సారధ్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో గిడుగు రామూర్తి పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఉద్యమాలే శరణ్యం

అగనంపూడి: విశాఖ ఉక్కును కాపాడుకోడానికి ఉద్యమాలే శరణ్యమని వీఎస్ఈయు నాయకుడు మహాలక్ష్మినాయుడు, పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఈనెల 31న పదవీ విరమణ పొందనున్న ఏఐసీటీయు రాష్ట్ర అధ్యక్షుడు చిత్రాడ సన్యాసిరావును పోరాట కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అయోధ్యరామ్, కె.సత్యనారాయణరావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, పరిరక్షణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



ఏఐసీటీయూ నేత సన్యాసిరావును సత్కరిస్తున్న పోరాట కమిటీ నాయకులు

జిల్లా స్థాయి ఖోఖో విజేత అక్కిరెడ్డిపాలెం



విజేతలతో స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా జిల్లా స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు ఆంధ్రాయూనివర్సిటీలో మైదానంలో నిర్వహించారు. గురువారం జిల్లా స్థాయి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్ 14 విభాగంలో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలను కలెక్టర్ హరేందిర ప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఒలిపింక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రతినిధులు, ఒలింపియన్ మాణిక్యాలు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వర రావు చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీని అందజేశారని అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ పీడీ ఇస్మాయిల్ తెలిపారు.

క్రీడా ప్రతిభా పురస్కారం

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సారథ్యంలో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో కణితి హైస్కూల్ విద్యార్థులు రాణించి 180 పాయింట్లతో ముందంజలో ఉండడంతో క్రీడా ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. క్రీడా ప్రతిభా పురస్కారాన్ని పాఠశాల హెచ్‌ఎం సూర్య ప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, పి.నారాయణరావులు అందుకున్నారు.



కలెక్టర్ చేతులు మీదుగా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న మన్నాజీ

దోమల నివారణకు చర్యలు

పెదగంట్యాడ: దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా విష జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అలర్ట్ అయ్యారు. దోమల కారణంగా జ్వరాలు విజృంభిస్తుండడంతో వాటి నివారణకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో డ్రోన్ సాయంతో గురువారం గంబూషియా చేపలను విడిచిపెట్టారు.

గెడ్డలో జోరుగా పూడికల తొలగింపు..

బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో గెడ్డలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ప్రజారోగ్య శాఖాధికారుల ఆధ్వర్యంలో గెడ్డల్లో జోరుగా పూడిక తీత పనులు చేపట్టారు. ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్ సిబ్బందితో కలసి ఆయా పనులు చేపట్టారు.



డ్రోన్ సాయంతో చెరువులో గంబూషియా చేపలను వదులుతున్న దృశ్యం

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో యాక్సెప్ట్ ప్రతినిధులు

గాజువాక: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు యాక్సెప్ట్ సంస్థ ప్రతినిధులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యాక్సెప్ట్ ప్రోగ్రాం మేనేజర్ పద్మప్రియ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాక్సెప్ట్ ఫీల్డ్ ఆఫీసర్లు లక్ష్మి, రషీద్, జయమ్మ, రామలక్ష్మి, హారిక, కోమలి దేవి, కరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఉక్కు శ్రామిక సంఘం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం వద్ద జరిగిన కార్యక్రమంలో నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేస్తే సహించబోమన్నారు. విభాగంలో టెండర్ పూర్తి చేసి 14 నెలలు పూర్తయిందని, వెంటనే అందులో పనిచేసిన 34 మందికి ఫుల్ అండ్ ఫైనల్ వెంటనే చెల్లించాలన్నారు. ఆరేళ్ల క్రితం టెండర్ పూర్తయిన అందులో పని చేసే 180 మంది కార్మికులకు ఇంత వరకు ఫుల్ అండ్ ఫైనల్ చెల్లించలేదన్నారు. అనంతరం విభాగాధిపతి చంద్రశేఖర్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, వేణురెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు టౌన్ అడ్మిన్ వద్ద ధర్నా చేస్తున్న శ్రామిక సంఘం నాయకులు, కార్యకర్తలు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలి

పెదగంట్యాడ: విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఒప్పందనాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ గాజువాక శాఖ కార్యదర్శి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతారావు డిమాండ్ చేశారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో మీటర్ రీడర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అంగీకరించబోమని ప్రకటించిందని, ఇప్పుడు ఎలా ఒప్పందం చేసుకుంటారని ప్రశ్నించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కానీ జిల్లాలో ఇప్పటికే స్మార్ట్ మీటర్లను డంప్ చేశారన్నారు. మీటర్ల రీడర్లు చాలీచాలని జీతాలతో సతమవుతున్నారని, స్మార్ట్ మీటర్ల వల్ల వారి పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసి మీటర్ రీడర్లను ఆదుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న అచ్యుతరావు

వర్షంలో తడుస్తూ బస్సు ఎక్కాల్సిందే..

గాజువాక: ఇది గాజువాక మెయిన్ రోడ్‌లోని పాతగాజువాక జంక్షన్. ప్రతిరోజు వేలాదిమంది విద్యార్థులు, ప్రయాణికులు ఈ జంక్షన్‌లో ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. కొత్త గాజువాక, సింథియా, డాక్‌యార్డు మీదుగా విశాఖ నగరానికి వెళ్లే బస్సులకు ఇదే ప్రధాన జంక్షన్. అయితే ఈ జంక్షన్‌లో ప్రయాణికుల కోసం కనీసం నిలువ నీడలేదు. గతంలో ఇక్కడ పెద్ద షల్టరే ఉండేది. అప్పట్లో ఇక్కడ దుకాణాల నిర్మాణం సమయంలో వాటిని తొలగించారు. ఆ తరువాత ఆర్టీసీ అధికారులు దాని గురించి పట్టించుకోవడం మానేశారు. ఎంతోమంది అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చి అలసి ఊరుకున్నారు. ఫలితంగా ఈ జంక్షన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎంత సమయమైనా నిలబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిందే. వానొస్తే తడవాల్సిందే. ఎండను సైతం భరించాల్సిందే. దీనిపై అధికారులు ఇప్పటికైనా స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పాతగాజువాక జంక్షన్‌లో వానలో తడుస్తూ బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు